ఒంద్రు జోలలో ఎంపీడీఓ పర్యటన

విశాలాంధ్ర -కొత్తూరు:మండలం ఒంద్రుజోల పంచాయితీలో ఎంపిడిఓ త్రివిక్రమ రావు మంగ్లవారం పర్యటించారు. ముందుగా కులగనన సర్వేపై ఓఇంటికెళ్ళి క్రాస్‌చెక్ చేశారు. అనంతరం సచివాలయం తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల వివరాలను కార్యదర్శి దిల్లేశ్వరరావు నుండి అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ రిజిస్ట్రేషన్‌ల పరిస్థితిపై సమీక్షించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై సమీక్షించారు.

నేడు జీడితోట వేలంపాట

విశాలాంధ్ర-పోలాకి : ప్రతిఏటా నిర్వహిస్తున్న వార్షిక జీడితోట వేలంపాట నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉషశ్రీ తెలిపారు. ప్రకటన విడుదల చేస్తూ 30 వేల రూపాయలు ధరావత్ చెల్లిస్తూ లక్ష రూపాయలు సాల్వ్ న్స్ సర్టిఫికేట్ తో మండల పరిషత్ కార్యాలయానికి నేడు హాజరుకావాలని కోరారు.

గురుకులానికి మంచినీటి సౌకర్యం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి సమీపంలో గల గొల్లకంచిలి గ్రామానికి ఆనించియున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి అవసరాలు తీర్చేందుకు 3లక్షల వ్యయంతో బోర్‌వెల్ నిర్మాణంతో పాటు మినీ వాటర్ ట్యాంక్ సిస్టంను ఏర్పాటు చేసి మంగళవారం ఎంపీపీ పైల దేవదాసురెడ్డి ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినందుకు పాఠశాల యాజమాన్యం ఎంపీపీ దేవదాసురెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చిట్టిబాబు, కొనపల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్మశాన రహదారి నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి, అక్కుపల్లి గ్రామాలకు చెందిన శ్మశానంనకు రోడ్డు నిర్మాణం కోసం మంగళవారం మాజీ సర్పంచ్ లండ రామలింగం చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి ప్రతినిధి మద్దు పరమేశ్వరి, రాంప్రసాద్‌లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు నుంచి శ్మశానంనకు వెళ్లే రహదారి లేక రెండు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండే వారమన్నారు. జెడ్‌పిటిసి నిధులు 9 లక్షల రూపాయలతో శ్మశాన వాటిక వరకు కంకరరోడ్డు వేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా జెడ్‌పిటిసి వైస్‌చైర్మన్ పాలిన శ్రావణిశ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోనేరు కామేశ్వరరావు, మద్దు సుదీర్, పి.శేఖర్, కె.సోమశేఖర్, లండ క్రిష్ణారావు, బి.ధనరాజు, పిన్నాసి ధనరాజు, ముకుంధంలు పాల్గొన్నారు.

రూ.40లక్షలతో రహదారి నిర్మాణం

విశాలాంధ్ర-సోంపేట :సోంపేట పట్టణంలో మంగళవీధి నుంచి కోదండ రామస్వామి ఆలయం వరకు రూర్బన్ నిధులు 40లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీపీ పొడుగు కామేష్, కూర్మారావు, మండల ఇంజనీరింగ్ అధికారి రమేష్, వైస్ సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్ట్‌ను అభినందించిన ధర్మాన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్‌కుమారి ఇటీవల కాకినాడలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ వ్యక్తిగత పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళంలోని తన క్యాంపు కార్యాలయం మంగళవారం అభినందించారు. ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి మరిన్ని పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కిరణ్‌కుమారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : సాధారణ ఎన్నికలకు కౌంటింగ్ కేంద్రంగా నిర్ణయించిన ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని శ్రీశివాని ఇంజనీరింగ్ కళాశాలల భవనాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి.ఆర్.రాధికతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ముందస్తుగా కళాశాలలోని అన్ని బ్లాకుల గదులను, వాటి విస్తీర్ణాన్ని పరిశీలించారు. పోలింగ్ అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్ లను గుర్తించారు. ఈ కేంద్రంలో 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా సీసీ కెమెరాల నిర్వహణ, నిరంతరం విద్యుత్తు ఇంటర్నెట్ సౌకర్యం గురించి సూచనలు చేశారు. గతంలో ఇదే కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్డీవో సిహెచ్ రంగయ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధులు దుప్పల వెంకట్రావు, రాజు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

దళితులను విస్మరించిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

- దళిత సింహగర్జనను విజయవంతం చెయ్యండి
- మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఈనెల 11న రాజమండ్రి వేమగిరిలో నిర్వహించనున్న దళిత గర్జనను విజయవంతంచేసి దళితుల సత్తాను చాటాలని మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో ఇల్లిసుపురం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్ష కుమార్ మాట్లాడుతూ దళిత సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలుకు తగిన గుణపాఠం చెబుతామన్నారు.రావాలి జగన్ అన్న చోటే పోవాలి జగన్ అన్న పరిస్థితి జగన్ తెచ్చుకున్నారని దళితుల నోట్లో మట్టి కొట్టారని మండి పడ్డారు. దళిత సంక్షేమానికి ప్రవేశ పెట్టిన 25స్కీంలను ఏకపక్షంగా రద్దుచేసి నియంత అనిపించుకున్నారని,రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పాలని అన్నారు. దళితులు ఐక్య పోరాటంతోనే ప్రభుత్వం దిగివస్తుందని చలో వేమగిరి సభను జయ ప్రదం చేసి సత్తా చాటాలన్నారు.ఈ సమావేశంలో డాక్టర్ గంజి ఏజ్రా, భరత్ భూషణ్, పోతుల దుర్గా రావు, మురళికృష్ణ, బోనేల అప్పారావు, బోసు మన్మథ, బింకం బాసూ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలను వినియోగించరాదు

- సవళాపురంలో కార్డన్ సెర్చ్ - సిఐ దివాకర్ వాయునందన యాదవ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఎటువంటి పత్రాలు లేని వాహనాలను వినియోగించ రాదని అలా వినియోగిస్తే చట్టపరంగా చర్యలు చేపడతామని ఆముదాలవలస సీఐ దివాకర్ వాయునందరి యాదవ్ తెలిపారు. మంగళ వారం తెల్లవారు జామున సరుబుజ్జిలి మండలంలోని మూల సవళా పురం గ్రామంలో పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వ హించారు. ఎటువంటి పత్రాలులేని తొమ్మిది వాహనాలను సీజ్ చేసి సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ కు తరలించారు. సిఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సరుబుజ్జిలి ఎస్ఐ నిహార్, పొందూరు ఎస్ఐ వై రవికుమార్‌లు పోలీసు సిబ్బందితో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఎటువంటి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. వాహన దారులు వారు వినియోగించే వాహనాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని గుర్తింపు పత్రాలు విధిగా ఉండాలని తెలి పారు.ఇప్పటికైన వాహనదారులు వారివారి వాహనాలకు రిజిస్ట్రేషన్ పొల్యుషన్ ఇన్సు రెన్సులతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ లు కలిగి ఉండాలని తెలిపారు.అన్ని గ్రామాల్లోను సర్ప్రైజ్ తనిఖీలు నిర్వహించి అటువంటి వాహనాలను సీజ్ చేయడంతోపాటు చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఆటోలు, వాహనదారులకు ప్రయాణికులకు రోడ్డు భద్రత అంశంపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

పాతపట్నం టీడీపీలో అలజడి..?

జనసేనకు కేటాయిస్తారంటూ మీడియాలో కథనాలు...

విశాలాంధ్ర-కొత్తూరు: శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం నియోజకవర్గాన్ని టీడీపీ,జనసేన పార్టీలో పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయిస్తారంటూ కొన్ని మీడియాల్లో, సోషల్ మీడియాల్లో కథనాలు రావడంతో టీడీపీ పార్టీ టికెట్ ఆశావాహుల్లో వారి అనుచరుల్లో అలజడి నెలకుంది. మూడు రోజులక్రితం టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు ఉండవిల్లి బాబు నివాసంలో పోటీచేసే సీట్లుపై సర్దుబాటుపై సుదీర్ఘ సమయం చర్చలు అనంతరం వివిధ మీడియాల్లోని పై కథనాలు వస్తున్నాయి. జిల్లాలో పాతపట్నం సీటును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అడిగారాన్నది ఆ కథనాల సారాంశం దీంతో టీడీపీ సిటింగ్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మరో ఆశావాహులు మామిడి గోవిందరావు అనుచరుల్లో, వారిని అనుసరించే టీడీపీ వర్గాల్లో కాస్తంతా అలజడి నెలకుంది. ఈ పరిణామాలతో సంబంధం లేకుండా సిటింగ్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కలమట పార్టీ కార్యక్రమాలతో గ్రామాలలో పర్యటించి ప్రజలతో కలుస్తున్నారు. మరో ఆశ వాహులు మామిడి గోవిందరావు కూడా టీడీపీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలతో ముందుకు సాగుతున్నారు. ఇంతకాలం టీడీపీ కోసం కష్టపడ్డ ఆపార్టీ నాయకులు క్యాడర్ ఇపుడు పొత్తు ధర్మం అంటూ జనసేనకు పాతపట్నం సీటు కేటాయిస్తే ఒకరికొకరు సహకరిస్తరా? అన్నది మరో కొద్దిరోజుల వరకు వేచిచూడాలి !?

టీడీపీ గెలుపుతోనే రాష్ట్రానికి మంచి రోజులు

తేదేపా పార్టి జిల్లా యువత అధ్యక్షులు దాసునాయుడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... రానున్న ఎన్నికల్లో తెలుగదేశం పార్టీ గెలుపుతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు అన్నారు. మంగళవారం మూలపేట పంచాయతీలో మండల తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మెండ దాసునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే తెదేపా ప్రభుత్వం వస్తుందని రాష్ట్రానికి, మన గ్రామాలకు మంచిరోజులొస్తాయని కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు జీరు భీమారావు, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ కూచెట్టి కాంతారావు, మండల బిసి సెల్ ప్రధాన కార్యదర్శి సూరాడ ధనారాజు, మండల మాజీ ఎంపిపి ప్రతినిధి కర్రి విష్ణు, మండల మాజీ వైస్ ఎంపిపి సూరాడ భీమారావు, నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షులు పంగ ఆసిరినాయుడు, మండల బిసి సెల్ అధ్యక్షులు మోడి రామచంద్ర, గోవిందపురం ఎంపిటిసి మెండ త్రినాధరావు (సాయిరాం), మేఘవరం మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్ రెడ్డి, సవ్వాన ప్రసాదు, మండల ఐటిడిపి అధ్యక్షులు బెండి అరుణ్‌కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్, పంచాయతీ జనసేన నాయకులు, మండల తెదేపా నాయకులు పంచాయతీ నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఈనెల 4వ తేదీన నెల్లూరులో జరిగిన మొదటి సౌత్ ఇండియా

కర్రసాము పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని పసిడి పథకాలు కైవసం చేసుకున్నారు. మంగళవారం శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కర్రసాము అసోసియేషన్ కార్యదర్శి కె తారకరామ మాట్లాడుతూ ప్రాచీనకళల్లో ఒక భాగమైన కర్రసాము కళను నెల్లూరులో చిల్డ్రన్ పార్క్ నందు ఆదివారం జరిగిన మొదటి సౌత్ ఇండియా పోటీల్లో రుప్ప నరేంద్ర నాయుడు, బగ్గు హర్షవర్ధన్ పాల్గొని ఒంటి కర్ర సాము, రెండు కర్రల సాము, ఒంటి కర్ర యుద్ధము విభాగల్లో నాలుగు పసిడి పథకాలు, ఒక రజితం, ఒక కాంస్య పథకాలు కైవసం చేసుకున్నా రన్నారు. గెలుపొందిన విజేతను కర్ర సాము ఫెడరేషన్ అఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె శ్రీహరి, జి శ్రీనివాసరావు, రాష్ట్ర కర్రసాము అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె భాస్కరరావు,శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ వుషు అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి శివకుమార్ క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందనలు తెలియజేసినట్లు చెప్పారు.

10 కేజీల గంజాయి పట్టివేత

నలుగురుపై కేసు నమోదు - ఎస్సై పారినాయుడు

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ సాయిరాం మందిరం సమీపంలో 10కేజీల గంజాయిని కాశీబుగ్గ పోలీసులు స్వాధీనం చేసుకొని నలుగురు పై కేసు నమోదు చేశామని కాశీబుగ్గ ఎస్సై పారి నాయుడు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం పర్లాఖిముండి ప్రాంతానికి చెందిన నాగ అప్పారావు అనే వ్యక్తి గంజాం జిల్లా జురంగో ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నాడని, గత 15 రోజుల క్రితం పలాసలో 15 కేజీల గంజాయి తీసుకు వచ్చి విక్రయించారని చెప్పారు. గంజాయి కావాలని తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి కే వల్లుకుండి ప్రాంతానికి చెందిన రాజారాం పాల్ రాజు, లతాపాల్ రాజ్, రాధా మాతి వనం అనే ముగ్గురు వ్యక్తులు నాగరాజుకు ఫోన్ లో సంప్రదించారు. దీంతో ఈనెల ఆరోవ తేదీన సాయి రాం గుడి వద్దకు వస్తే గంజాయి ఇస్తామని చెప్పారు. ఆ విషయం ప్రాథమిక సమాచారం మేరకు కాశీబుగ్గ సిఐ ఎన్ హెచ్ బి ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పడి వీరుని పట్టుకొని 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 10 వేలు ఉంటుందని, వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించింది

16న బంద్

విశాలాంధ్ర-పలాస : కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వేణు గోపాల్, జిల్లా ఎఐకెఎం జిల్లా నాయకులు మద్దిల రామారావు, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు తామాడ సన్యాసిరావులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, బ్యాంకు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా తదితర కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేశారని, కార్పొరేట్ కంపెనీల యజమానులకు అటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. విద్యుత్ చట్టం సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టింది. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం సామాన్య ప్రజలకు నిత్యవసర వస్తువులన్నింటిపైన జీఎస్‌టీ పేరుతో పన్నులు పెంచిందన్నారు. గత 12 ఏళ్లల్లో బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వలనే ఆదాని అంబానిలు ప్రపంచ కుబేరుల జాబితాలకు చేరారన్నారు. పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఇలా లక్షా 50వేల మంది ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రాన్ని ద్రోహం చేసిందని, ప్రత్యేక హోదాను నిరాకరించింద న్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల నష్టపరిహారం, పునారావాసం తనకు సంబంధం లేదని చెబుతుండడం దారుణమన్నారు. రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమల ఇవ్వకపోగా తెలుగు ప్రజల పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ఎలా అమ్మకానికి పెడతారని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి పట్టెడి మట్టితో సరిపెట్టి కృష్ణ జలాల పంపిణీలోరాష్ట్రానికి ద్రోహం తల పెట్టిందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరి స్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యూడెమాక్రసీ నాయకులు గొరకల బాలకృష్ణ, పిడిఎస్‌యు నాయకులు ఎం.వినోద్‌కుమార్, పోతనపల్లి కుసుమ, పిన్నింటి నాగేశ్వరరావు, ఎస్.గణపతి, వంకల అప్పయ్య, గోపి, అఖిల్‌లు పాల్గొన్నారు.

భర్త వేదిస్తున్నాడని కుల పెద్ద ఇంటి ముందు నిరసన

విశాలాంధ్ర -కోటబొమ్మాళి : ఇటీవల మనవరాలుపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఆరోపణల ఎదురుకుంటూ జిల్లా సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మండలం కొత్తపేటకు చెందిన కోరాడ ప్రసాద్ కోడలు వసంత వారి కుల పెద్ద అయిన కోటబొమ్మాళికి చెందిన పైడిశెట్టి రాంకుమార్ ఇంటి ముందు మంగళవారం నిరసన చేపట్టింది. వివరాల్లోకి వెళితే తన మామ ప్రసాద్ తనకు వివాహం అయినప్పటి నుంచి తనకు శారీరక వేదింపులకు గురిచేస్తున్నాడని, భరిస్తూ వస్తున్నప్పటికీ తాజాగా ఇటీవల తన కుమార్తెపై కూడా అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడని అయితే తనకు బెయిల్ పెట్టేందుకు డబ్బులు అవసరం ఉందని, ఇంట్లో బంగారం ఇవ్వాలని తన భర్త సురేష్ తనకు చితకబాదుతున్నాడని వివరించింది. అయితే ఏ విషయమైనా మా కులపెద్ద అయిన పైడిశెట్టి రాంకుమార్‌కు చెప్పకుండా ఏవని చేయదని, ఇప్పుడు కూడా తనపై వేదింపులకు బాధ్యత రాంకుమార్‌దేనని ఆరోపిస్తూ అందుకే ఇక్కడ నిరసన చేసేందుకు వచ్చానని వసంత స్పష్టం చేసింది. అప్పటికే చుట్టూ చేరిన గ్రామస్థులు, పెద్దలు ముందు తమ కుటుంబ పరిస్థితులను వారి ముందు వెలబుచ్చుకుంటు కన్నీరుమున్నీరు అయ్యింది. అయితే తన ఇంట్లో 40 తులాలు బంగారు పోయినట్లు తన సురేష్ అందరికీ చెబుతున్నారని అయితే ఇంట్లో బంగారం పోలేదని, అది బయట ఉంటే నా భర్త ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తాడని, ఈ బంగారం భద్రపరిచానని, తనవద్దనే ఉందని వసంత స్పష్టం చేసింది. మా బ్రతుకులు చిద్రం చేస్తున్న మా మామ ప్రసాద్ బెయిల్ కోసమైతే నా బంగారం ఇవ్వాల్సిన అవసరం నాకు లేదని అమె తెలిపారు. అయితే పక్క ఇంట్లో ఉన్న స్థానిక దేశం నేత బోయిన గోవిందరాజులు బయ ట జరుగుతున్న హడావిడిని గుర్తించి బయటకు వచ్చి పరిస్థితిని అడిగితెలుసుకొని సర్ది చెప్పడంతో సమస్య సర్దుమనిగింది.

టీడీపీ, జనసేన కూటమిదే విజయం : పీఏసీఎస్ మాజీ చైర్మన్ హేమబాబు

విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమిదే విజయమని పిఏసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి అన్నారు. మంగళ వారం నగరంపల్లి, పెద్దబడాం గ్రామాల్లో పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా హేమబాబు చౌదరి మాట్లాడుతూ రైతుల సమస్యలను గాలికి వదిలేసి మాటలతోనే పూటలు గడుపుతున్నారని విమర్శించారు. ఐదేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందక రైతులు పంటలు నష్టపోతుంటే పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. సాగునీటి కోసం అవగాహన లేని పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో వ్యవస్థలు నాశనం అయ్యాయని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం, సహజవనరుల దోపిడీ, హత్యలు, మానభంగాలు, దళితులపై దాడులు పెచ్చుమీరాయని అన్నారు. విశాఖ లో నిజాయతీ పరుడైన తహసీల్దార్ సనపల రమణయ్య హత్య వైసీపీ అరాచక పాలనకు అద్దం పడుతుంది అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ రాక్షసులను తరిమేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి. సాంబమూర్తి, దువ్వాడ జయరాం చౌదరి, బి.శశిభూషణ్, ఎం.దుర్యోధనరెడ్డి, అంబటి రామకృష్ణ, దువ్వాడ అప్పారావు, సనపల చక్రవర్తి, ఎన్.సూర్యనారాయణ, కె.దుర్గారావు, ఆర్.శాంత మూర్తి, మామిడి అప్పారావు, ఆనందరావు, గోపాలరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఓట్ల నమోదుపై కోర్టును ఆశ్రయిస్తాం

- ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం
- మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ కలమట వెంకటరమణ

విశాలాంధ్ర-అరసవల్లి: ఒడిశా రాష్ట్రానికి చెందిన వందలాది ఓట్లు పాతపట్నం నియోజక వర్గ ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ కలమట వెంకటరమణ ఆరోపించారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు మండలం బూత్ నెంబర్ 202 లో ఓటర్ల జాబితాలో ఒడిశాకు చెందిన వ్యక్తుల పేర్లతో ఓట్లు నమోదు చేశారని అన్నారు. 202 బూత్ లో 81 ఓట్లు తమ గ్రామానికి చెందినది కాదని ఇతర రాష్ట్రంలో ఉన్న వారిని సైతం చేర్చారని చెప్పారు. గతంలో జిల్లాకు స్పెషల్ ఎలక్ట్రోరల్ స్పెషల్ ఆఫీసర్ గా వచ్చిన శ్యామలరావు ను కలసి ఫిర్యాదు చేశానన్నారు. ఆయన జిల్లా కలెక్టర్ తో సహా కింది స్థాయి అధికారులు అందరికీ దీనిపై విచారణ జరిపించాలని ఆదేశించినట్లు చెప్పారు. అయినప్పటికీ ఎలాంటి మార్పు లేకుండా పాత ఓటర్లను చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఒడిశా ఓటర్లను బంధుత్వం పేరుతో హిరమండలం ఓటర్ల జాబితాలో చేరుస్తున్నారని అన్నారు. ఒడిశాకు చెందిన భార్య భర్తలకు నాగమణి, విశ్వనాథం వ్యక్తులకు పాతపట్నం ఓటర్ జాబితాలో చేర్చారని చెప్పారు. చివరకు ఎలక్షన్ కమిషన్ ను కూడా విఫలమైందని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా ఓటర్ జాబితాను రూపొంది స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిరమండలం జడ్పిటిసి పొగిరి బుచ్చిబాబు మాట్లాడుతూ హిరమండలం మేజర్ పంచాయితీలోని బూత్ నెంబర్ 303లో 262 ఓట్లు అక్రమంగా నమోదు చేశారని తెలిపారు. తమ గ్రామానికి సంబంధం లేని వారిని, మరణించిన వారిని సైతం ఈ జాబితాలో చేర్చడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ఈ విషయమై ఏఈఆర్ఓ, ఈఆర్వోలకు సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తేజేశ్వరరావు, విభూది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి కోర్టు విధులు బహిష్కరణ

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు

విశాలాంధ్ర-శ్రీకాకుళంస్పోర్ట్స్/క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ హక్కు చట్టం 2022 కు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 16 వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. అధ్యక్షులు ఎన్ని సూర్యరావు అధ్యక్షతన జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం జనరల్‌బాడీ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ హక్కు చట్టం 2022ను నిరసిస్తూ ఈనెల 8నుంచి న్యాయవాదులంతా కోర్టు విధుల బహిష్కరణను చిత్తశుద్ధి నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానిచ్చారు. బాయికాట్ సమయంలో న్యాయవాదులు కోర్టుల విధులు బహిష్కరణ కాలంలో ఏ రకమైన దావాలు గానీ, సెషన్స్ కేసులు, బెయిలు కానీ, ఇతరత్రా ఎటువంటి మాటర్‌లు విచారణ చేయుటగానీ రిప్రజెంటేషన్ చేయకూడని నిర్ణ యించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ ప్లీడర్లు బోయ్ కట్ కాలంలో సాక్షులను ప్రవేశపెట్ట కుండా ఉండాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు గొంటి చంద్రమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, పొన్నాడ వెంకట రమణరావు, కూన రాజారావు, కొంక్యాన సుభాష్, నాగభూషణరావు, ఖగేంద్రనాథ్, సనపల హరి, వై మురళీ మోహనరావు, భవానీ ప్రసాద్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

చలపరాయి వినోద్‌కుమార్‌కు తెలుగు వెలుగు కళారత్న అవార్డు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని పెద్దకపాసుకుద్ది గ్రామానికి చెందిన మృదంగ విద్వాంసులు చలపరాయి వినోద్ కుమార్ కు యువ చైతన్య వెల్ఫర్ సొసైటీ విశ్వకర్మ సేవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద,సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు 2024 సందర్భంగా శాస్త్రీయ సంగీత మృదంగ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను వినోద్ కుమార్ ను జాతీయ తెలుగు వెలుగు కళా రత్న అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహక కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ వలభోజు మోహనరావు, కోఆర్డినేటర్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ ఆచార్యులు జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం రోజున టీఎన్‌జిఓ భవన్ హనుమకొండలో జరిగిన ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ చేతుల మీదగా అవార్డును అందుకున్నారు.ఈ మేరకు జాతీయ తెలుగు వెలుగు కళారత్న అవార్డు అందుకున్నందుకుగాను వినోద్ కుమార్‌కు తన గురువు మావూరి సత్యనారాయణ శర్మ,సూరి ప్రసాద్ శర్మ,బొంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ, దుంపలు ఈశ్వరరావు గణపతి శర్మ,మన్మధరావు కుమారి, యామని కృష్ణ,శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయ ధర్మకర్త పి కృష్ణారావు, సర్పంచ్ దమయంతి కాయ భీమసేన్, విశ్రాంతి ఉపాధ్యాయులు కరగాన ఏకాంబర రావు, పాతిన చంద్రశేఖరం, నిరంజన్, శంకర్ గురుస్వామి, చలపరాయి రవి, పూడి హరి నారాయణ, బొర్ర హరి, సివంగి షణ్ముఖరావు, నర్తు గంగయ్య మాస్టర్, గోనప లక్ష్మణ మూర్తి, పులకల శ్రీరాములు, పాతిన వెంకటరావు, భారత మాత యువజన సభ్యులు, భక్తభజన కళాకారులూ, గ్రామ పెద్దలు, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట కళాకారులు, గ్రామస్తులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఐఎస్‌ఎఫ్‌కు ఎంపికైన శ్రీకాకుళం యువతి

విశాలాంధ్ర -జలుమూరు/సారవకోట: మండలం సత్రం గ్రామానికి చెందిన యువతి ధర్మాన తులసి సిఐఎస్ఎఫ్ కు(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) ఎంపికయింది. ఈనెల 24న బిలాయిలో రిపోర్టింగ్ చేయాలని ఉన్నతాధికారుల నుండి కాల్ లెటర్ వచ్చినట్లు ఆమె తెలిపారు. సిఐఎస్ఎఫ్ కు మండలం నుంచి ఈమె మొదటి వ్యక్తిగా ఎంపికయ్యారు.

విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ

విశాలాంధ్ర - జలుమూరు: జలుమూరు మండలం రావిపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంఈఓ బి. మాధవరావు ట్యాబ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు కన్నయ్య, సీఆర్పీ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కారవంతమైన విద్య మన లక్ష్యం : ఎంపీపీ డాక్టర్ దాసు

విశాలాంధ్ర-సోంపేట : సంస్కారవంతమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే సంస్కారభారతి విద్యాసంస్థల లక్ష్యమని స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. పట్టణంలో గల సంస్కారభారతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం మార్కుల కోసం, ప్రతిభ కోసం మాత్రమే విద్యాసంస్థలు పని చేయరాదని అన్ని విధాలుగా వారిని తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని కోరారు.అటువంటి సంస్థల్లో సంస్కారభారతి ఒకటని అన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్న సంస్కారభారతి హైస్కూల్ తీరును అభినందించారు. చదువులోను, సంస్కారంలోను, క్రీడల్లోను, పోటీ పరీక్షల్లోను, ఉద్యోగాల సాధనలోను మనమే ముందుండాలన్న కసితో సాగిస్తున్న ప్రయత్నం మంచి ఫలితాలను ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భీమారావు కృషిని వక్తలు అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన ప్రతిఒక్కరిని ఉర్రుతలూగించాయి. ప్రిన్సిపాల్ శిలగాన భీమారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నిమ్మన లీలారాణి, ఎన్ని దేవరాజు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పలాస నుంచి బిలాయికి రైలు సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు: పలాస నుంచి బిలాయి వరకు రైలు సదుపాయం కల్పించాలని, బిలాయితో పలాస ప్రజలకు చాలా అనుబంధం కలిగి ఉందని ఆంధ్ర ఉత్కల్ సంఘర్ష సమితి అధ్యక్షులు ఉమాశంకరరావు కోరారు. ఇటీవల దుర్గ్ లోకసభ ఎం.పి విజయ బఘోల్, కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమాజ్ చీఫ్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ, (ఆదిలీల పౌండేషన్), ఎల్.శ్రీనివాసరావు, బి.రాజేంద్రప్రసాద్, కె.చంద్రశేర్, రోషన్ తామ్రాకర్, సౌరబ్ చౌబె న్యూఢిల్లీలో రైలు భవనంలో సమావేశమై దుర్గ్ నుంచి పలాస వరకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును నడపడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త రైల్వే కానుకతో దుర్గ్, బిలాయి, చరోడా, కుమారి, రాయ్‌పూర్, కోస్తా ఆంధ్ర, ఒడిస్సా రాష్ట్రాల ప్రజలకు రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ప్రస్తుతం దుర్గ్ నుంచి పలాస, బరంపురం వరకు రైలు సౌకర్యం లేదని, దుర్గ్ నుంచి పలాస, బరంపురంలకు దూరం 505 నుంచి 722 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించేందుకు మూడు రైలును మారాల్సి వస్తుందని, దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ప్రయాణించడం చాలా ఇబ్బందులు పడుతున్న విషయాల కోసం వినతిపత్రంలో పేర్కొని చర్చించామని తెలిపారు.

రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు : పలాసలో సోషల్ ఆడిట్

విశాలాంధ్ర-పలాస:పలాస మండలం లొత్తూరు గ్రామంలో ఐటీడీఏ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో భాగంగా రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రజా వేదికలో సోషల్ ఆడిట్ బృందం బయట పెట్టింది. పలాస ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో 2022-23 ఏడాదిలో జరిగిన పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డుమా పిడి జీవి చిట్టి రాజు పాల్గొన్నారు. లొత్తూరు గ్రామంలో ఐటిడిఎ నిధులతో చేపట్టిన రోడ్డు రక్షణ గోడ నిర్మాణంలో తేడా ఉన్నట్లు గుర్తించి రూ. 1.30 లక్షలు రికవరీకి పిడి ఆదేశించారు. 19 పంచాయతీల్లో మస్టర్ల పై సంతకాలు లేకుండా ఉపాది కూలీలకు బిల్లులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్ లో గుర్తించామని స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటరావు ప్రజా వేదిక దృష్టికి తీసుకు వచ్చారు. 2022-23 ఏడాదిలో రూ. 8.65 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కాలువలు, నీటి గుంటలు, రోడ్లు, సిసి రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేపట్టినట్లు ప్రజా వేదిక దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా డుమా పిడి జి వి చిట్టి రాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ ఉపాధి పనులను కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆదేశించారు. మస్టర్ల నిర్వహణ బాగులేదని, ఇలాగే కొనసాగితే ఫీల్డ్ అసిస్టెంట్లు పై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి డి లవరాజు, క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్ బాబు, ఎపిడి శ్రీనివాసరావు, ఎపిఓ శంకర్రావు, ఈసి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ను కలిసిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి నాయకులు

విశాలాంధ్ర-అరసవల్లి: మున్సిపల్ నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారిని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తమ సమస్యలపై దృష్టి సారించాలని కమిషనర్ ను కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు రానా శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుమలరావు, ఇలా నాయకులు నత్తల రవి, రాడ రఘు, రాడ మనోహర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్నూరు రాజు, ఎంఎస్‌పి నాయకులు యాదవ సూరిబాబు, ఆర్ గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణదారులు నిబంధనలు పాటించాలి

అసిస్టెంట్ సిటీప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన వరహాలబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: భవన నిర్మాణదారులు ప్రభుత్వం సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.వరహాలబాబు తెలిపారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో ఏసీపీగా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల్లో భాగంగా తాను రాజమండ్రి నుంచి ఇక్కడికి వచ్చానని తెలిపారు. 35 ఏళ్ల సర్వీస్‌లో వివిధ హోదాల్లో అనేకచోట్ల విధులు నిర్వహించినట్లు చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కమిషనర్ ఆదేశాల మేరకు వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు. ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారికి తొలి దశలోనే నోటీసులు అందజేసి అక్రమ నిర్మాణాలను తొలగించడం జరుగుతుందని వివరించారు. సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజల సహకారంతో సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగ్యస్వామ్యం అవుదామని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ కంటిని సంరక్షించుకోవాలి

- ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన - టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్స్ సెంథిల్ కుమార్

విశాలాంధ్ర-కవిటి : ప్రతిఒక్కరూ తమ కంటిని సంరక్షించుకోవాలని కరాపాడు టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్స్ సెంథిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కరాపాడు టోల్ ప్లాజా ఆవరణంలో జిల్లా అంతర్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి సోంపేట వారు రోడ్ సేఫ్టీ మంత్లీ అవర్నెస్ కార్యక్రమంలో భాగంగా రోడ్ యూజర్స్,డ్రైవర్స్‌కు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి మందులు, కళ్ళద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాపాడు టోల్ ప్లాజా సిబ్బంది వివికే వి.ప్రసాద్, టోల్ ప్లాజా మేనేజర్ జి.వి.రమణారావు, శేఖర్ రాథోడ్, సేఫ్టీ మేనేజర్ కిరణ్ కుమార్, సంజయ్, ఇన్సిడెంట్ మేనేజర్ రవి.కొప్పల, మైంటెనెన్సు మేనేజర్ చిన్ని,రవికుమార్, ఎస్‌హెచ్‌ఎఐఆర్ఈ, ఎస్.పి.సాహు, పారామెడికల్ సిబ్బంది, టోల్ ప్లాజా బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామాల్లో సీసీ రోడ్లు, గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దామోదరరావు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, మండల ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

జెడ్పి చైర్‌పర్సన్‌ను కలిసిన ముఖ్య కార్యనిర్వాహణాధికారి

విశాలాంధ్ర-కవిటి: జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.వెంకటేశ్వరరావు జెడ్ పి చైర్పర్సన్ విజయమ్మ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ మేరకు విజయమ్మ నివాసం బల్లిపుట్టుగలో నూతనంగా విధుల్లో చేరిన జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి వెంకటేశ్వరరావు పిరియా విజయమ్మ ను పుష్ప గుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజలకు పథకాలు అందించడం తెదేపాకే సాధ్యం : మండల టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందించడం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుకే సాధ్యమని టిడిపి మండలపార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పూజారి శైలజలు అన్నారు. మంగళవారం మండలం సౌడాం, నారాయణవలస పంచాయతీలలో జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెదేపా ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి మహిళకు రూ.1500, తల్లికివందనం కింద ఇంటిలో ఎంత మంది విద్యనభ్యసిస్తే వారందరికీ రూ.15వేలు తల్లుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా, ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తెదేపా ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు, సురక్షిత మంచినీటి సరఫరా, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు సహాయం అందించ డం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్ట సింహాచలం, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, నంబాళ శ్రీనివాస్, బాడాన రమణమ్మ, సాసుమంతు ఆనందరావు, హనుమంతు అప్పల రాజు, తంగుడు సునీల్, దేవాది సింహాద్రమ్మ, వాన లక్ష్మి, ముత్తురాజు, జి. నర్సింగరావు, మెట్ట మోహనరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పాగోటి అనిల్‌కుమార్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బటన్ నొక్కుడు సరే... లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులేవి

- టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు శైలజ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రాష్ట్రంలో ప్రజల కోసం 122 సార్లు బటన్ నొక్కానని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ తర్వాత ఎంతమంది లబ్దిదారుల ఖాతాల్లో నిధులు జమవుతున్నాయో కూడా నిజం చెప్పాలని టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ డిమాండ్ చేశారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జనవరి 23వ తేదీన ఆసరా 4వ విడత నిధులు విడుదల అంటూ బటన్ నొక్కినా ఇప్పటివరకు ఎందుకు లబ్దిదారుల ఖాతాల్లో డబ్బులు పడలేదో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. జగన్ బటన్ నొక్కుడు సంక్షేమం ఎంతో అబద్ధమో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కా అని చెబుతూ మహిళల ఖాతాల్లో నిధులు జమ చేయకుండా జగన్ తనంతట తనే అందుకు ఆధారాలు అందించాడని ఎద్దేవా చేశారు. ఆసరా ఒక్కటే కాదు, జగన్ ఇప్పటి వరకు ఇదే రీతిలో రైతుల నుంచి విద్యార్థుల వరకు బటన్ నొక్కుడు పేరుతో మోసం చేస్తున్నారని, ప్రచారానికి వాస్తవానికి పొంతన ఉండడం లేదన్నారు. ముఖ్యంగా ఫీజు రియంబర్స్‌మెంట్లు జమకాక ఎంతో మంది విద్యార్థుల చదువులు ప్రమాదంలో పడ్డాయన్నారు. చంద్రబాబు కంటే ఎక్కువ సంక్షేమం చేశా అని చెప్పుకోవడానికే జగన్ ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని, కానీ దానివల్ల పేద, సామాన్య వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దళితవాడలో దాహం కేకలు

- ఫిబ్రవరిలో ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఏమిటి అంటున్న ప్రజలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం అక్కయ్యవలస పంచాయతీ పరిధిలో గల దళిత వీధిలో మంచినీటి బోర్లు, కుళాయిలు లేక, వీధికి దూరంగా ఉన్న బోరులో నీరు రాకపోవడంతో త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోయారు. తమ గ్రామంలో అన్ని వీధులకు ఇంటింటికి కుళాయిలు ఉన్నప్పటికీ తమ వీధికి వేయలేదని తమ వీధిలో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.ఈ యేడాది వర్షాలు సరిగా పడకపోడంతో బోర్లులో సరిగా నీరు రావటం లేదని ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు ముదిరిన తరువాత తమ పరిస్థితి ఏమిటని వాలనీ వాసులు బెంబేలెత్తిస్తున్నారు. ప్రతి ఇంటికి కొళాయిలు వేసి ఇంటింటికి తాగునీరు అందిస్తామని ప్రభుత్వం, అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ మా వీధికి మాత్రం అది అమలు చేయటంలో సర్పంచ్, అధికారులు విఫలమయ్యారని కాలనీ వాసులు తెలిపారు. మా వీధికి తీవ్ర నీటి సమస్య ఉంది : మా వీధికి ఎప్పటి నుంచో తీవ్ర నీటి సమస్య ఉందని, ఎండకాలం తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌కు, అధికారులకు చాలా సార్లు చెప్పినా పలితం శూన్యమన్నారు. ప్రభుత్వం ఇంటింటికి కొళాయిలు వేసి త్రాగునీరు అందించాలని చెప్పినా తమ వీధికి మాత్రం అది అమలు చేయటంలేదు.

అల్లుడు గిల్లుడు అని లేవనెత్తిందే పవన్..

విశాలాంధ్ర-పలాస : అల్లుడు గిల్లుడు అని, అల్లుడు టాక్స్ అని మొదట లేవనెత్తింది గత ఎన్నికలలో జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కాదా... అప్పుడు ఖండించని నాయకులు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అంటే ఎందుకంత బాధ అని పలాస వైకాపా నాయకులు ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, వైకాపా జిల్లా వర్తక విభాగం కార్యదర్శి బెల్లాల శ్రీనివాస్, కాశీబుగ్గ వైశ్య సంఘ కార్యదర్శి కోట్ని విజయ్, కొంచాడ రాజాశ్రీకాంత్, పెంట రత్నాకర్, తూముల శ్రీనివాసరావులు అన్నారు. మంగళవారం కాశీబుగ్గ ప్రగతి భవన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికలలో అల్లుడు గిల్లుడు అనేది తప్పుగా అన్నానని నేడు మీ పొత్తులో ఉన్న పవన్ కళ్యాణ్ తో చెప్పించగలరా అని ప్రశ్నించారు. గిల్లుడు అంటే పర్యాయపదం బాధపెట్టడం అని వ్యాపారులకు గతంలో అల్లుడు ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. వ్యక్తిగతంగా కక్షగట్టి కేసులు కట్టించిన సంఘటనలు ఉన్నాయని. అల్లుడు టార్గెట్ చేస్తే అవతల వ్యక్తి నాశనమే అనేది ఆయా నాయకులే బహిరంగంగా చెప్పిన సంఘటనలు ఉన్నాయన్నారు. విద్యాసంస్థ పక్కన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శివాజి అంగీకరించకపోవడంతో అల్లుడు వద్దకు బంకు యజమాని వెళ్లి అదేచోట పెట్టించుకున్నాది నిజం కాదా అని ప్రశ్నించారు. అల్లుడు మాట వినకపోతే వ్యాపారుల ఇళ్లపై, ఫ్యాక్టరీలపై దాడులు చేయించిన ఘనత అల్లుడిది కాదా అని ప్రశ్నించారు. కెటిరోడ్ వంద అడుగుల విస్తరణకు అప్రూవల్ తెచ్చిన చేయించుకోలేక పోయారని, మంత్రి అప్పలరాజు అధికారం చేపట్టిన తరువాత వ్యాపారులపై దాడులు కాని, వ్యక్తిగత కక్షలు కాని ట్యాక్సులు కాని లేవని, వ్యాపారుల అందరి సహకారంతో నేడు విస్తరణ పనులు పూర్తి చేసి సుందరంగా తయారు చేయడం వల్ల నేడు ఎన్నో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు పట్టణానికి వచ్చాయన్నారు. మంత్రి అప్పలరాజును మరో మారు గెలిపించుకొని వైశ్యులంతా వ్యాపార అభివృద్ధి సాదించే విదంగా ఆలో చనలు చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్ధిక సాయం

విశాలాంధ్ర -నంతబొమ్మాళి... సంతబొమ్మాళి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ విభూది నాగు కుటుంబానికి సంతబొమ్మాళి గ్రామానికి చెందిన జై దుర్గాభవాని ఆటో సంఘం ప్రతినిధులు 10000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు తన కుటుంబ సభ్యులకు నగదును మంగళవారం అందజేశారు. గతకొద్దిరోజులుగా సంతబొమ్మాలి జై దుర్గాభవాని ఆటో యూనియన్‌లో సభ్యుడిగా ఉంటూ ఆటో డ్రైవర్గా తన జీవనం గడుపుతున్న నాగు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈమేరకు ఆటో యూనియన్ నాయకులు కల్లాడ శివ ఆధ్వర్యంలో ప్రతినిధులు, సభ్యులు తమ వంతుగా చందాలు వేసుకొని కుటుంబాన్ని ఆదుకోవాలని మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం చేసినట్లు ఆటో యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

మృదంగ విన్యాసంలో మాస్టర్ సాయిచరణ్ బేష్

విశాలాంధ్ర-కవిటి: తెలంగాణ రాష్ట్ర వరంగల్ జిల్లా హనుమకొండ టీఎన్జీవో భవన్లో జరిగిన యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ విశ్వకర్మ సేవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో మండలంలోని కపాసుకుద్ది గ్రామానికి చెందిన మాస్టర్ చలపరాయి సాయి చరణ్ తన మృదంగ విన్యాసాలతో అందర్నీ అలరించాడు. సాయి చరణ్ మృదంగం విన్యాసాన్ని అనందంగా వీక్షించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేంద్రరెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు, హనుమ కొండ జిల్లా పరిషత్ చైర్పర్సన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ చేతులు మీదుగా సత్కరించారు.

నడక ఉద్యమానికి గుర్తింపు తెచ్చిన గుప్తా + వక్తలు కితాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నడక సంఘాలకు అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక గౌరవం గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తుల్లో గుప్తా ఒకరని స్టార్ వాకర్ స్ క్లబ్ సభ్యులు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజియన్ కౌన్సిలర్-3, మరియు వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టు బోర్డు సభ్యులు,పాస్ట్ డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ పొట్నూరు గోవింద్ గుప్తా జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్టార్ వాకర్ స్ క్లబ్ అధ్యక్షుడు బెవర వెంకట రవిశంకర్ గుప్తా సమాజానికి నడక సంఘాల కు అందించే సేవలు వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ చరిత్రలో తొలిసారిగా 102 సంస్థలకు ఒక ప్రత్యేక గుర్తింపు గౌరవం తెచ్చిన వ్యక్తి గుప్తా అని కొనియాడారు. అంతర్జాతీయ నడక సంఘాల నాయకులు జి. ఇందిరా ప్రసాద్, గుడ్ల సత్యనారాయణ లు మాట్లాడుతూ... నడక ఉద్యమాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ముందుకు తీసుకువెళ్లిన మహనీయులు గుప్తా అని అన్నారు. స్టార్ వాకర్ స్ క్లబ్ సభ్యునిగా పదేళ్ల క్రితం చేరి నాటి నుండి అనేక సామాజిక సేవా కార్యక్రమాలనిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న గుప్తా అందరి అభిమానాన్ని చూరగొన్నా రని కొనియాడారు. అంతకన్నా ముందు కేక్ కట్ చేసి గుప్తా కు స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి. దేవీ ప్రసాద్, ఆర్. వి. ప్రసాద్, సుగంధం సంజీవరావు, గోలీ ఉమా మహేశ్వర రావు, గోలీ సంతోష్, ఎం. మల్లి బాబు, ఐకే రావు, వూన్న నాగభూషణం, బిఎస్ఎన్ఎల్ నాయుడు, కొండలరావు, శివాజీ, అయ్యప్ప స్వామి సన్నిధానం ప్రతినిధులు పాలకొండ ప్రశాంత్, సింహాచలం, వి నాగేశ్వర రావు లు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కవిటి, దూగానపుట్టుగ గ్రామాలలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పిరియా విజయ సాయిరాజ్ కవిటి మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం లోని కవిటి పంచాయతీ పరిధిలోని బెహరా వీధిలో శ్రీ జగన్నాథ స్వామి ఆలయానికి 5 లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులతో స్వామి వారి మండపానికి,శ్రీ త్రినాద్ స్వామి వారి ఆలయానికి 5 లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులతో స్వామి వారి మండపానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ చేతులు మీదుగా భూమి పూజ చేపట్టారు. అలాగే దూగానపుట్టుగ గ్రామ పంచాయితీ పరిధిలో మహంకాళిపుట్టుగ గ్రామంలో 5 లక్షల జడ్పీ నిధులతో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. దూగానపుట్టుగ గ్రామ పంచాయితీ పరిధిలోని పెట్టవీధి లో 2.5 లక్షల రూపాయల ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ ను శంకుస్థాపన చేసారు.దూగానపుట్టుగ గ్రామ పంచాయితీ గ్రామంలో 1.70 లక్షల జడ్పీ నిధులతో నూతనంగా నిర్మించిన మంచి నీటి బోరు%ఢ%మోటర్ ను కొటియావీధి లో 1 లక్ష రూపాయల పంచాయితీ నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ ఆమె చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేసారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, కవిటి మేజర్ పంచాయతి సర్పంచ్ పూడి లక్ష్మన్ రావు, దూగానపుట్టుగ సర్పంచ్ దుగాన బద్రాచలం, మండల కోసం సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, ఎంపీటీసీ 1, 2, 3సభ్యులు పూడి నీలచలం, అలిగి హేమలత ధర్మరావు,మానెక శంకర్ ప్రాధాన్,బెంధాలం జయప్రకాశ్, ఎస్పీ నారాయణ స్వామి, రెడ్డిక జేసీసీ సెక్రెటరీ భార్ల నాగభూషణం, బద్రి ప్రకాష్, నర్తు శివాజీ, పిన్నింటి జయరాం, ఎన్ని అశోక్, సంతోష్ బెహరా, దువ్వు కృష్ణ రావు, బడ్డాయి మురళి, దుగాన మోహన్ రావు, దుద్ది సతీష్, వైయస్ రమణ, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరునికి జలాభిషేకం

విశాలాంధ్ర-జలుమూరు : శ్రీముఖలింగేశ్వరునికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించామని ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు. జలాభిషేకం చేయడం వల్ల పాడిపంటలు బాగా పండి, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా కలకాలం ఉంటారన్నారు. ఇది పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ధనంజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆరాచకాలను చరమగీతం పాడండి

విశాలాంధ్ర-మందస: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలను చరమ గీతం పాడండి అని మందస మండల టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం బుడారిసింగి, పాతకోట, మరదమేక, రాంపురం గ్రామాల్లో పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ పార్టీని గెలిపించాలని, టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భావన దుర్యోద, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, టి.ధనుంజయ, ముంజేటి చంద్రశేఖర్, మెట్ట మహేష్, దేబాసిస్ పండా, సంతోష్‌కుమార్ గౌడ, మంగళ పాత్రో, రామ్మోహనాయక్, నీలాంచల్ సాహు, ఫుడియా సన్యాసి, భగవాన్ బిస్వాల్, కత్తిపు జగన్నాధం, అగ్గున్న తిరుపతిలు పాల్గొన్నారు.

యువశక్తి ఫౌండేషన్ సభ్యులు ఉదారత

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బి గొనపపుట్టుగ గ్రామం కు చెందిన యువశక్తి ఫౌండేషన్ సభ్యులు నిరుపేద కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.ఈ సందర్భంగా మంగళవారం బి.గొనపపుట్టుగ పంచాయతీ కొర్రాయిపుట్టుగ గ్రామంలో మహంకాళి ధర్మారావు ఆనారోగ్యంతో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న యువశక్తి ఫౌండేషన్ ముఖ్య సభ్యుడు బొడ్డ జగదీష్ ఆధ్వర్యంలో ధర్మారావుకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయంగా వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ సభ్యులు గున్న కాళీ ప్రసాద్, బద్రి రామారావు, వాలంటీర్ ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారిపుట్టుగలో సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం మండపల్లి పంచాయతీ అమ్మవారి పుట్టుగ గ్రామంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీ ల్యాడ్ నిధులతో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సహకారంతో చేపట్టిన రహదారి నిర్మాణ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదిన రామారావు, మండలపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐను కలిసిన జిల్లా యువత ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర-సంతబొమ్మాలి...ఈ మండలం మరువాడ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు సంతబొమ్మాలి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై సిద్దార్థ కుమార్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్ప గుచ్చాని ఇచ్చి పరిచయం చేసుకొని చేసుకున్నారు.

ఉపాధి హామీ వేతనదారులకు 'స్పర్శ' పై అవగాహన

విశాలాంధ్ర -జలుమూరు: మండలం శైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాగోడు, గొటివాడ గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి హామీ వేతన దారులకు వైద్య సిబ్బంది "స్పర్శ" కార్యక్రమం పై అవగాహన కల్పించారు. శరీరముపై ఎటువంటి అనుమానస్పద మచ్చలు కనిపించినా తప్పనిసరిగా ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఆరోగ్య పర్యవేక్షకులు రామకృష్ణ, సచివాలయ వైద్య సిబ్బంది. మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.